

ఎందుకనో వెనుకబడ్డాయి..
స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకుల్లో మున్సిపాలిటీలు వెనుకబడ్డాయి. ఖమ్మం, ఇల్లెందు ర్యాంకులు గతంతో పోలిస్తే దిగజారాయి. 8లో



బంజారాల బతుకమ్మ తీజ్
గిరిజన బంజారాల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా తీజ్ ఉత్సవాలు తండాల్లో ఘనంగా జరుపుకుంటున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
28° / 24°

వాతావరణం
జిల్లాలో శనివారం సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. అక్కడక్కడా ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్వర్ణ కవచధారణలో రామయ్య


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థాన అంతరాలయంలోని మూల మూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం


అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి)ఆలయంలో అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకం, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలు నిర్వహించారు. కుంకుమపూజ, గణపతిహోమం జరిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, డైరెక్టర్ పాపారావు పాల్గొన్నారు.

శిశుగృహను సజావుగా నడపాలి


శిశుగృహలో పరిశీలిస్తున్న న్యాయమూర్తి రాజేందర్

భద్రాచలంఅర్బన్: శిశుగృహను సజావుగా నడపాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజేందర్ సూచించారు. భద్రాచలం బ్రిడ్జి సెంటర్‌లోని శిశుగృహను శుక్రవారం ఆయన సందర్శించారు. చిన్నారులకు అందుతున్న సేవలపై ఆరా తీసి, నిర్వాహకులకు సూచనలు చేశారు. అనంతరం భద్రాచలం సబ్ జైలులో తనిఖీలు చేపట్టారు. ఖైదీలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. నిరుపేద ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సబ్ జైల్ అధికారి ఉపేందర్, శిశుగృహ నిర్వాహకులు చంటి బాబు పాల్గొన్నారు.

నిర్మాణంలో నిర్లక్ష్యం!


కొత్తగూడెంలో నిర్మాణంలో ఉన్న సింగరేణి క్వార్టర్లు

సింగరేణి క్వార్టర్ల నిర్మాణ పనుల్లో జాప్యం
- రూ.273 కోట్లతో పనులు చేపట్టిన యాజమాన్యం
- ఏడాది క్రితమే గడువు ముగిసినా ఇంకా అసంపూర్తిగానే..
- అధికారుల తీరుపై విమర్శలు, ఆరోపణలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: వందేళ్ల క్రితం బొగ్గు ఉత్పత్తితో మొదలైన సింగరేణి ప్రస్థానం బహుముఖంగా సాగుతోంది. థర్మల్, సోలార్ విద్యుత్ ఉత్పత్తితోపాటు తాజాగా రేర్ ఎర్త్ మినరల్స్ మైనింగ్ రంగంలోనూ అడుగులు వేస్తోంది. అయితే గతంలో తలపెట్టిన పనులు పూర్తి చేయడంలో ఆలస్యం చేస్తోందనే అపవాదు మూటగట్టుకుంది. ఇప్పటికే కొత్త గనులకు అనుమతుల సాధనలో తీవ్ర జాప్యంపై అనేక విమర్శలు వస్తున్నాయి. ఇప్పుడు కార్మికుల క్వార్టర్ల నిర్మాణంలోనూ అదే పరిస్థితి నెలకొంది.

రూ. 273 కోట్ల వ్యయంతో..
సింగరేణి సంస్థ రూ. 273 కోట్లతో కొత్తగా 643 క్వార్టర్లు నిర్మించాలని 2022లో నిర్ణయించింది. వీటిలో సత్తుపల్లిలో 81, కొత్తగూడెంలో 558 క్వార్టర్ల నిర్మాణం చేపట్టింది. ఇందులో రుద్రంపూర్‌లో 270, త్రీ ఇంక్లైన్ బంగ్లోస్ ఏరియాలో 83, కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా బంగ్లోస్ (ఇల్లెందు గెస్ట్ హౌస్)లో 14, రైటర్ బస్తీలో 195 క్వార్టర్లు ఉన్నాయి. వీటి నిర్మాణ పనులు 2023 ఆరంభంలోనే ప్రారంభమయ్యాయి. 2024 ఆగస్టు /సెప్టెంబరు నాటికి పూర్తి కావాల్సి ఉంది. ఏడాది క్రితమే గడువు ముగిసినా ఇప్పటివరకు క్వార్టర్ల నిర్మాణం పూర్తికాలేదు. ఆర్థిక పరిపుష్టి కలిగిన సింగరేణి సంస్థకు నిధుల కొరత లేదు. అయినా క్వార్టర్ల నిర్మాణంలో జాప్యం జరుగుతుండగా, ఇందుకు అధికారుల పర్యవేక్షణ లోపమే కారణమనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే అన్ని ఏరియాల్లో కలిపి సుమారు 12 వేలకు పైగా క్వార్టర్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఈ తరుణంలో మళ్లీ కొత్తగా నిర్మించాల్సిన అవసరమేంటనే ప్రశ్నలు క్వార్టర్ల నిర్మాణం ఆరంభించినప్పుడే ఉత్పన్నమయ్యాయి.

ఎగ్జిక్యూటివ్ కేడర్ పైనా దృష్టి సారించాలి..
క్వార్టర్లు నిర్మించే విషయంలో వెనువెంటనే నిర్ణయాలు తీసుకోవడం, టెండర్లు పిలవడం, గుత్తేదారుకు పనులు అప్పగించడంలో కనిపించిన వేగం ఆ తర్వాత వెంకటేష్‌ఖనిని ప్రారంభించడంలో కనిపంచలేదు. మూడేళ్లుగా ఈ ప్రాజెక్టు కాగితాలకే పరిమితమైంది. ఈ గనిలో పని చేసే కార్మికుల కోసమంటూ నిర్మిస్తున్న క్వార్టర్లు సైతం గడువు ముగిసినా ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. రూ.273 కోట్లతో చేపట్టే నిర్మాణ పనులకు సంబంధించి పంచాయతీ/కార్పొరేషన్ నుంచి అనుమతులు తీసుకోవడంలో నిర్లక్ష్యం, నిర్మాణ సామగ్రి కొనుగోలులో జాప్యం చేయడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పని ప్రదేశాల్లో భారీ యంత్రాలను సమర్థంగా వినియోగించుకోవడం, పని గంటల్లో వృథా సమయాన్ని తగ్గించడం వంటి అంశాలపై ఇటీవల సంస్థ దృష్టి పెట్టింది. ఉత్పాదక సామర్థ్యం విషయంలో కార్మికులపై దృష్టి పెట్టినట్టుగానే ఎగ్జిక్యూటివ్ కేడర్ విషయంలోనూ యాజమాన్యం దృష్టి సారించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆది నుంచీ విమర్శలే
త్వరలో వెంకటేశ్‌ఖని(వీకే)-7 ఓపెన్ కాస్ట్ ప్రారంభం అవుతుందని, అందులో పని చేసే కార్మికుల కోసం కొత్తగా క్వార్టర్లు నిర్మిస్తున్నామని సింగరేణి అధికారులు తెలిపారు. నిబంధనల ప్రకారం గని ప్రారంభమైన తర్వాత మూడేళ్లపాటు అక్కడ ఉత్పత్తి జరిగి, ఆ పని ప్రదేశంలో బొగ్గు వెలికి తీయడం లాభసాటిగా ఉందని నిర్ధారణ జరిగాకే కార్మికుల నివాసాల కోసం క్వార్టర్లు నిర్మించాలి. కానీ కొత్తగూడెం ఏరియా, కార్పొరేట్ పరిధిలో క్వార్టర్ల విషయంలో డిజైన్లు ఖరారు చేయడం, టెండర్లు పిలవడం వంటి పనుల్లో అధికారులు ఆగమేఘాల మీద నిర్ణయాలు తీసుకున్నారు. కానీ భవనాల నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయించడంలో విఫలమవుతున్నారు.

త్వరలో పూర్తవుతాయి
నిర్మాణ పనులకు అనుమతులు రావడం, మెటీరియల్ కొనుగోలు విషయంలో ఆలస్యమైంది. అందువల్ల నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది. ఈ ఏడాది చివరి నాటికి కొత్త క్వార్టర్లు అందుబాటులోకి వస్తాయి.
– డి.వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్ (సివిల్)

పేరు భద్రాచలం.. స్టేషన్ ఏపీలో!

- ఇటీవల భద్రాచలం–మల్కాన్‌గిరి రైల్వే లైన్‌ను ప్రకటించిన కేంద్రం
- స్థల సమస్యతో విలీన గ్రామంలో స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు
- ఆంధ్రప్రదేశ్ విలీన పంచాయతీలతో మరో సమస్య ఉత్పన్నం
- ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో కలిపితేనే శాశ్వత పరిష్కారం



కొత్తగూడెంలో ఉన్న భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్

భద్రాచలం: ఇటీవల కేంద్ర ప్రభుత్వం భద్రాచలం–మల్కాన్‌గిరి రైల్వే లైన్ ప్రకటించటంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఆ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చే క్రమంలో భద్రాచలం రైల్వే స్టేషన్ నిర్మాణానికి గుర్తించిన గ్రామాలు విలీన ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయి. ఆధ్యాత్మిక క్షేత్రమైన భద్రాచలం పేరు కేవలం రికార్డుల్లో నమోదు కాగా, స్టేషన్ మాత్రం ఆంధ్రప్రదేశ్‌లో ఉండనుంది. భద్రాచలం నుంచి అక్కడి వరకు రోడ్డు మార్గంలో వెళ్లాల్సి ఉంటుంది. ఇప్పటికే భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ జిల్లా కేంద్రంలో ఉంది. ఇలా జగత్‌ను ఏలే రారాజుగా కీర్తింపబడే జగదభి రామయ్య కొలువైన భద్రగిరిలో రైల్వే స్టేషన్ ఉండే పరిస్థితి లేకుండా పోయింది.

మల్కాన్‌గిరి–భద్రాచలం, కొత్తగూడెం–కిరండోల్ వయా భద్రాచలం
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలోని గిరిజన గ్రామాలను అనుసంధానం చేస్తూ మల్కాన్‌గిరి–భద్రాచలం రైల్వే లైన్ ప్రతిపాదించారు. 173 కిలోమీటర్ల మేర లైన్ నిర్మించాలని, పలు చోట్ల భారీ వంతెనలు, అండర్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని ప్రణాళిక రూపొందించారు. ఒడిశాలోని జేపూర్ వరకు, అక్కడి నుంచి మల్కాన్‌గిరి, తిరిగి భద్రాచలం వరకు ఈ లైన్ ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. రైల్వేలైన్ నిర్మాణానికి తొలుత సుమారు రూ.2,800 కోట్లు, ఆ తర్వాత రూ.3,592 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఒడిశాలోని మల్కాన్‌గిరి, బదలి, కోవాసి గూడ, రాజన్‌గూడ, మహారాజ్ పల్లి, లూనిమన్‌గూడ స్టేషన్‌లు, ఆంధ్రప్రదేశ్‌లోని కన్నాపురం, కుట్టుగుట్ట, పల్లు, నందిగామ మీదుగా భద్రాచలంలోకి ప్రవేశించనుంది. ఈ నేపథ్యంలో భద్రాచలంలో స్థల సమస్యతో ఏపీలోని ఎటపాక, పిచుకులపాడు తదితర గ్రామాల వద్ద రైల్వే స్టేషన్ నిర్మించేలా అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. అక్కడి నుంచి తెలంగాణలోని నదికి అవతలి వైపు పాండురంగాపురం వరకు గోదావరిపై రైల్వే బ్రిడ్జితో అనుసంధానం చేసే అవకాశం ఉంది. దీంతోపాటు తెలంగాణలోని కొత్తగూడెం– ఛత్తీస్‌గఢ్‌లోని కిరండోల్ వరకు 160.33 కిలో మీటర్ల ప్రతిపాదన సైతం ఉంది. దీనికి సైతం భద్రాచలం స్టేషన్‌తో పాటు గోదావరి బ్రిడ్జిపై రైల్వే వంతెనే కీలకం. ఇవి ఏర్పాటైతే దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి భద్రాచలానికి రైల్వే రవాణా, సౌకర్యం అందుబాటులోకి వస్తుంది.

విలీన పంచాయతీలు వస్తే..
ప్రస్తుతం భద్రాచలం రైల్వే స్టేషన్ ప్రతిపాదిత గ్రామాలు ఉమ్మడి రాష్ట్రంలో భద్రాచలం గ్రామపంచాయతీ పరిధిలో ఉండేవి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విభజన క్రమంలో ఆ గ్రామాలను ఏపీలో కలిపారు. కన్నాయిగూడెం, పిచులకపాడు, గుండాల, పురుషోత్తపట్నం, ఎటపాక గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని అప్పటి నుంచి ఆ గ్రామాల ప్రజలు, భద్రాచలం ప్రాంత వాసులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొని ఆ పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలిపితే శాశ్వత పరిష్కారం లభిస్తుంది. దీంతో భద్రాచలం రైల్వే స్టేషన్ తెలంగాణలోనే ఉంటుంది. దేవస్థానం భూములపై ఆలయ వర్గాలకు, పురుషోత్తపట్నం గ్రామస్తుల నడుమ జరుగుతున్న గొడవలకు సైతం ఫుల్‌స్టాప్ పడే అవకాశం ఉంది.

ఆ గ్రామాలను తెలంగాణలో కలపాలి



రాష్ట్ర విభజనతో ఇప్పటికే భద్రాచలానికి తీవ్ర నష్టం జరిగింది. విలీన గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలి. దీనివల్ల భద్రాచలం రైల్వే స్టేషన్ భద్రాచలంలోనే ఉంటుంది. ఆ దిశగా ప్రజాప్రతినిధులు ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలి.
–ఎస్‌కే షరీఫ్, స్థానికుడు

ఉద్దీపకంతో విద్యా ప్రమాణాల మెరుగు

భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్


చిన్నారి ప్రతిభను పరిశీలిస్తున్న పీఓ రాహుల్

బూర్గంపాడు: గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల విద్యాప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఉద్దీపకం వర్క్‌బుక్‌ను ప్రవేశపెట్టామని భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ అన్నారు. బూర్గంపాడు మండలంలోని భాస్కర్‌నగర్, రాజీవ్ నగర్‌లలోని గిరిజన సంక్షేమశాఖ జీపీఎస్ పాఠశాలల్లో శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా రాణించేలా ప్రాథమికస్థాయి నుంచే ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు ఉద్దీపకం వర్క్‌బుక్ నిర్వహించే తీరుపై ఎస్‌సీఆర్‌పీలు పర్యవేక్షణ చేయాలన్నారు. అర్థమయ్యేలా వర్క్‌బుక్ బోధిస్తున్న ఉపాధ్యాయురాలు రాజ్యలక్ష్మిని అభినందించారు. అనంతరం విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు.

సీపీఐ మహాసభలకు ముస్తాబు


తోరణాలతో అలంకరించిన రింగ్ సెంటర్

అశ్వారావుపేటరూరల్: సీపీఐ జిల్లా మహాసభలకు అశ్వారావుపేట ముస్తాబైంది. నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లు పూర్తిచేశారు. స్థానిక శ్రీశ్రీ ఫంక్షన్ హాల్‌లో శని, ఆదివారాల్లో జరిగే జిల్లా మూడో మహాసభలకు వేదికను సిద్ధం చేశారు. రింగ్ రోడ్ సెంటర్‌ను తోరణాలతో అలంకరించారు. సత్తుపల్లి, జంగారెడ్డిగూడెం, భద్రాచలం మార్గాల్లో కూడా పార్టీ జెండాలు, తోరణాలు కట్టారు. దీంతో అశ్వారావుపేట ఎరుపుమయంగా మారింది.

ఈపీఎఫ్ చెల్లించాలి

పాల్వంచ: ప్రతి ఉద్యోగి, సిబ్బందికి ఆయా సంస్థలు, కాంట్రాక్టర్లు ఈపీఎఫ్‌ను తప్పక చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వరంగల్ రీజనల్ పీఎఫ్ కమీషనర్ వై. శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక నవ లిమిటెడ్ సంస్థలో ఉద్యోగ ఆధారిత ప్రోత్సాహక పథకం(ఈఎల్‌ఐ)పై కేటీపీఎస్, నవ లిమిటెడ్ యాజమాన్యం, ఉద్యోగులు, కాంట్రాక్టర్లు, పెన్షనర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ సంతకం, బీమా, పెన్షన్ పథకం తదితర ప్రయోజనాలు వివరించారు.

గరిమెళ్లపాడు నర్సరీ అభివృద్ధికి చర్యలు

కలెక్టర్ జితేష్ వి.పాటిల్


అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ జితేష్

చుంచుపల్లి: గరిమెళ్లపాడులోని హార్టికల్చర్ నర్సరీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని గరిమెళ్లపాడు హార్టికల్చర్ నర్సరీ ట్రైనింగ్ సెంటర్‌ను సందర్శించారు. నర్సరీలో తోటలను పరిశీలించి, అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రశాంతినగర్ గ్రామపంచాయతీలో హరిత నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. వన మహోత్సవంలో భాగంగా ప్రతీ ఇంటికి మొక్కలు పంపిణీ చేయాలన్నారు. ఆ తర్వాత బీసీ రెసిడెన్షియల్ స్కూల్‌లో జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొన్నారు. పిల్లల భవిష్యత్ తీర్చిదిద్దేందుకు, నైపుణ్యం పెంపొందించుకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుభాషిని, తహసీల్దార్ కృష్ణ, హార్టికల్చర్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

‘ఓపెన్’ ఫీజు చెల్లింపు షెడ్యూల్ విడుదల

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో సెప్టెంబర్–2025లో నిర్వహించే పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన పరీక్ష ఫీజు చెల్లించేందుకు షెడ్యూల్ విడుదలైందని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరచారి, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ మద్దినేని పాపారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి అభ్యర్థులు థియరీ సబ్జెక్టుకు రూ.100, ప్రాక్టికల్ సబ్జెక్టుకు రూ.100, ఇంటర్ అభ్యర్థులు థియరీ సబ్జెక్టుకు రూ.150, ప్రాక్టికల్ సబ్జెక్టుకు రూ.150 చొప్పున చెల్లించాలని వివరించారు. అపరాధ రుసుముతో ఆగస్టు 18వ తేదీ వరకు అవకాశం ఉందని, అభ్యర్థులు సంబంధిత సెంటర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.


సమగ్రాభివృద్ధికి కృషి

- విమానాశ్రయం ఏర్పాటు తథ్యం
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి నిరంతర కృషి చేస్తానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక శేషగిరి భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం కార్పొరేషన్, టూరిజం హోటల్, యూనివర్సిటీ తదితర అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించనున్నట్లు తెలిపారు. అనుకూల ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎర్త్ యూనివర్సిటీ కాకుండా అన్ని కోర్సులు ఉండేలా మల్టీ డిసిప్లిన్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. అన్ని వసతులతో కొత్తగూడెం కార్పొరేషన్ కార్యాలయం నిర్మించాలంటే రూ. 500 కోట్లు ఖర్చు అవుతుందని అన్నారు. సింగరేణి, కేటీపీఎస్‌లతో కొత్తగూడెం, పాల్వంచ బస్టాండ్లను ఆధునికీకరించేలా ప్రతిపాదనలు రూపొందిచామని తెలిపారు. పాల్వంచలో 800 మెగావాట్ల పవర్‌స్టేషన్ నిర్మాణానికి సుముఖత వచ్చిందన్నారు. కొత్తగూడెం, పాల్వంచ జూనియర్ కళాశాలల అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. 150 సీట్లతో నర్సింగ్ కళాశాల నిర్మిస్తామని చెప్పారు. పోస్టాఫీస్ నుంచి శేషగిరినగర్ మీదుగా డబుల్‌రోడ్ నిర్మాణాన్ని సింగరేణి చేపడుతుందన్నారు. రైతు బజార్ వద్ద మల్టీప్లెక్స్‌కు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో మూడు రోడ్లు మంజూరైనట్లు తెలిపారు. సీపీఐ నాయకులు కంచర్ల జమలయ్య, మునిగడప వెంకటేశ్వర్లు, వంగా వెంకట్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసాని, తాలిపేరుకు వరద ఉధృతి


తాలిపేరు ప్రాజెక్ట్ నుంచి విడుదలవుతున్న వరదనీరు


కిన్నెరసాని నుంచి దిగువకు విడుదల చేస్తున్న నీరు

పాల్వంచరూరల్/చర్ల: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో తాలిపేరు, కిన్నెరసాని ప్రాజెక్టులలో వరద నీరు చేరుతోంది. దీంతో శుక్రవారం తాలిపేరు ప్రాజెక్ట్ ఏడు గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. 30,821 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తుండగా, దిగువన ఉన్న తాలిపేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 74 మీటర్లు కాగా, వరద ఉధృతి దృష్ట్యా 71.20 మీటర్లుగా కొనసాగిస్తున్నట్లు డీఈ తిరుపతి తెలిపారు. కాగా శుక్రవారం ప్రాజెక్టు వద్ద వర్షపాతం 31 మిల్లీ మీటర్లుగా నమోదైంది. కిన్నెరసాని ప్రాజెక్ట్ రెండు గేట్లను ఎత్తి 8వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులుకాగా, ఇన్‌ఫ్లో 2,400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండటంతో శుక్రవారం నీటిమట్టం 404.40 అడుగులకు పెరిగింది. దీంతో రాత్రి రెండు గేట్లను ఎత్తి ఉంచి నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు పర్యవేక్షణ ఇంజనీరు తెలిపారు.

ఉద్యాన సాగుకు ప్రోత్సాహం

- పండ్ల తోటల పెంపకానికి భారీగా రాయితీలు
- ఎంఐడీహెచ్ పథకం ద్వారా మూడేళ్లపాటు వర్తింపు



హెక్టారుకు రాయితీ వివరాలిలా (రూ.లలో)

పంట	2024-25	2025-26
మామిడి	16,400	50,000
బొప్పాయి	30,000	30,000
అరటి	40,985	70,000
జామ	29,332	50,000
కోకో	22,000	30,000
డ్రాగన్ ఫ్రూట్	1,60,000	2,70,000
మల్చింగ్	16,000	20,000

సూపర్‌బజార్(కొత్తగూడెం)/బూర్గంపాడు: ఉద్యాన పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. పండ్ల తోటల పెంపకానికి భారీగా రాయితీలు పెంచింది. క్రమంగా తోటల విస్తీర్ణం తగ్గుతుండగా, రైతులకు చేయూతనందించేదుకు చర్యలు చేపట్టింది. జిల్లాలో 1,69,700 ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగవుతున్నాయి. ఇందులో ఆయిల్‌పామ్‌దే అగ్రస్థానం. 75 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగవుతుండగా, ప్రభుత్వం రాయితీ, గిట్టుబాటు ధరలతో సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఇదే తరుణంలో మామిడి, జీడిమామిడి, అరటి తోటల సాగు తగ్గుతోంది. ప్రస్తుతం జిల్లాలో 7,512 ఎకరాల్లో మామిడి, 12,069 ఎకరాల్లో జీడిమామిడి సాగవుతోంది. 1,756 ఎకరాలలో కొబ్బరి, కోకో 657 ఎకరాల్లో, 12 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ తోటలు సాగవుతున్నాయి. ఉద్యాన పంటల్లో 23 వేల ఎకరాల్లో మిర్చి, 10 వేల ఎకరాల్లో కూరగాయలు సాగవుతున్నాయి. చాలా ప్రాంతాల్లో రైతులు పండ్ల తోటలను తొలగించి ఆయిల్‌పామ్ సాగు చేపట్టారు. ఈ పరిస్థితుల్లో మళ్లీ పండ్ల తోటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం భారీగా రాయితీలను ప్రకటించింది.

అత్యధికంగా డ్రాగన్ ఫ్రూట్‌కు..
ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న మిషన్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ హార్టికల్చర్(ఎంఐడీహెచ్) పథకం ద్వారా పండ్ల తోటలకు ప్రభుత్వం రాయితీలు ప్రకటించింది. గతేడాది డ్రాగన్ ఫ్రూట్‌కు హెక్టారుకు రూ.1,60,000 రాయితీనివ్వగా ఈ ఏడాది రూ. 2,70,000కు పెంచింది. బొప్పాయి సాగుకు మాత్రం గతేడాది ఇచ్చిన రూ.30 వేల రాయితీని కొనసాగిస్తోంది. మిర్చి, కూరగాయల సాగులో వాడుకునే మల్చింగ్‌కు గతేడాది రూ.16వేల రాయితీనివ్వగా ఈ ఏడాది రూ.20వేలకు పెంచింది. మూడేళ్లపాటు ఇదే రాయితీలను కొనసాగించనుంది.

పండ్ల తోటల సాగు లాభదాయకం



ఉద్యాన పంటలకు మార్కెట్‌లో డిమాండ్ ఉంది. ప్రభుత్వం కూడా రాయితీలు పెంచింది. జిల్లాలో భూములు పండ్ల తోటల పెంపకానికి అనువుగా ఉన్నాయి. సంప్రదాయ పంటల కంటే తోటల సాగు లాభదాయకంగా ఉంటుంది. ఆసక్తి కలిగిన రైతులు హార్టికల్చర్ అధికారులను కలిసి దరఖాస్తు చేసుకోవాలి.
–జంగా కిషోర్, జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖాధికారి

క్లుప్తంగా

మెరుగైన వైద్యం అందించండి..


ఆస్పత్రి పైకప్పు లీకేజీలు పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ రవిబాబు

ఇల్లెందు: పది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో దోమలు ఎక్కువై రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని, వైద్యశాలకు వచ్చే రోగులకు సరైన వైద్యం అందించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు ఆదేశించారు. శుక్రవారం ఇల్లెందు ఆస్పత్రిలో ఆయన వైద్యులు, నర్సులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. తొలుత ఆస్పత్రిలోని వార్డుల్లో పర్యటించారు. పైకప్పు లీకేజీలను పరిశీలించారు. పరిశుభ్రత పాటించాలని సూచించారు. సమావేశంలో సూపరింటెండెంట్ హర్షవర్ధన్, ఆర్ఎంఓ రాంనివాస్, రేడియాలజిస్ట్ మాధురి, గైనకాలజిస్ట్ సింధు, ఈఎన్టీ తేజస్విని, సివిల్ సర్జన్ కనకరాజు, ఫిజియోథెరపీ సంధ్యారాణి, హెడ్ సిస్టర్ భవానీ, ఫర్జనా, భారతి, అర్మిలా, మినిస్టీరియల్ స్టాఫ్ రాహుల్, ఫార్మసిస్ట్ రజిని, శానిటేషన్ సూపర్‌వైజర్ జగదీశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో మునగ మొక్కను నాటాలి


మొక్క నాటుతున్న ట్రైనీ కలెక్టర్ సౌరభ్‌శర్మ

ఇల్లెందురూరల్: బహుళ ప్రయోజనాలు చేకూర్చే మునగ మొక్కను ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో నాటుకోవాలని ట్రైనీ కలెక్టర్ సౌరభ్‌శర్మ సూచించారు. మండలంలోని కొమరారం పీహెచ్‌సీని శుక్రవారం ఆయన సందర్శించారు. రోజువారీ ఓపీ వివరాలు, రిజిస్టర్లు పరిశీలించారు. వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం డీఎంహెచ్ఓ జయశ్రీ, ఎన్సీడీ పీఓ మధువన్, వైద్యులు, సిబ్బందితో కలిసి ఆస్పత్రి ఆవరణలో మునగ మొక్కలు నాటారు. ఆస్పత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ మునగ మొక్కను అందించి, ఇంట్లో నాటేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి లోహిత, సిబ్బంది పాల్గొన్నారు.

మతిస్థిమితంలేని యువతికి గర్భం?

దుమ్ముగూడెం: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని గిరిజన యువతి ఏడు నెలల గర్భవతిగా తేలినట్లు సమాచారం. కాగా ఆ యువతికి తల్లి లేదని, తండ్రి మాత్రమే ఉన్నాడని తెలిసింది. ఇటీవల ఆ యువతికి ఒంట్లో బాగాలేకపోవడంతో ఆస్పత్రికి తీసుకెళ్లగా గర్భం దాల్చిన విషయం బయటకు వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. విషయం ఐసీడీఎస్, ముస్కాన్ బృందానికి తెలియడంతో విచారణ చేపట్టినట్లు తెలిసింది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,463

ఎందుకనో వెనుకబడ్డాయి..

- స్వచ్ఛ సర్వేక్షన్‌లో పడిపోయిన పురపాలికల ర్యాంకులు
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో విసిరేసినట్లుగా ఉమ్మడి జిల్లా
- మున్సిపాలిటీలదే కాదు.. కార్పొరేషన్‌దీ అదేతీరు


ఇల్లెందు మున్సిపాలిటీ కార్యాలయం

ఖమ్మంమయూరిసెంటర్: స్వచ్ఛ సర్వేక్షన్ – 2024 ర్యాంకుల్లో ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీలు వెనుకబడ్డాయి. గతంలో మెరుగైన స్థానాల్లో నిలిచిన ఖమ్మం కార్పొరేషన్, ఇల్లెందు మున్సిపాలిటీ ర్యాంకులు ఈసారి దిగజారాయి. మిగతావి ముందంజలో నిలవకపోయినా గతంతో పోలిస్తే ర్యాంకులు స్వల్పంగా మెరుగుపడడం కొంత ఊరట కలిగిస్తోంది. కానీ జాతీయస్థాయి పక్కన పెడితే రాష్ట్రస్థాయి ర్యాంకుల్లోనూ ఉమ్మడి జిల్లా నుంచి ఏ మున్సిపాలిటీకి గౌరవనీయమైన స్థానం దక్కకపోవడం ప్రజలతో పాటు అధికారులను సైతం నిరాశ పరిచింది. ఏదిఏమైనా పట్టణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ, వ్యర్థాల శుద్ధి, తాగునీటి సరఫరా, చెరువుల నిర్వహణ, టాయిలెట్ల శుభ్రత వంటి అంశాలపై శ్రద్ధ కొరవడిందని స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకులు స్పష్టం చేస్తున్నాయి.

పడిపోయిన ర్యాంకులు..

గత కొన్నేళ్లుగా స్వచ్ఛత విషయంలో ఖమ్మం కార్పొరేషన్, ఇల్లెందు, కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలు కొంత మెరుగైన ఫలితాలే సాధించాయి. కానీ, ఈసారి ర్యాంకులు దిగజారడం గమనార్హం. స్వచ్ఛ సర్వేక్షన్ పేరిట కేంద్ర ప్రభుత్వం ఏటా పారిశుద్ధ్యం, పరిశుభ్రత, తాగునీటి నిర్వహణపై వార్షిక సర్వే చేయించి ఫలితాల ఆధారంగా ర్యాంకులు కేటాయిస్తోంది. ఈసారి తక్కువగా నమోదైన ర్యాంకులు మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధుల పనితీరును ప్రశ్నించేలా ఉన్నాయి. నిధులు కేటాయించడంతో సరిపెడుతూ వాటిని సమర్థవంతంగా వినియోగించడంలో మాత్రం పాలకవర్గాలు విఫలమయ్యాయనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రధానంగా వర్షాకాలం నగరాలు, పట్టణాల్లో నీటి నిల్వ, దోమల బెడద, చెత్త కుప్పలు వంటి సమస్యలు పెరుగుతున్న తరుణంలో స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకుల పతనం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఈ అంశాలను పాలకవర్గాలే కాక అధికారులు పరిగణనలోకి తీసుకుని పట్టణాల పరిశుభ్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్ – 2024లో ర్యాంకులు

కార్పొరేషన్ / మున్సిపాలిటీ	రాష్ట్ర ర్యాంకు	జాతీయ ర్యాంకు
ఖమ్మం	60	373
పాల్వంచ	49	302
కొత్తగూడెం	65	396
ఇల్లెందు	93	927
సత్తుపల్లి	95	941
మణుగూరు	103	1,032
మధిర	113	1,108
వైరా	129	1,290

ప్రచారాలతోనే సరి..

ఖమ్మం నగర పాలక సంస్థతో పాటు ఇతర మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రచారం ఊదరగొడుతున్న అధికారులు క్షేత్రస్థాయిలో మాత్రం విఫలమవుతున్నారనే విమర్శలున్నాయి. ఇంటింటా చెత్త సేకరణ చేస్తున్నా.. తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఎక్కడ కూడా సేకరించిన దాఖలాలు లేవు. ఇక ఈసారి వంద శాతం చెత్త సేకరించిన మున్సిపాలిటీగా ఒక్కటీ లేదు. ఉమ్మడి జిల్లాలో తడి, పొడి చెత్త సేకరణలో 39 శాతం మార్కులు సాధించి ఉమ్మడి జిల్లాలో కొత్తగూడెం మున్సిపాలిటీ అగ్రస్థానంలో నిలవగా... పబ్లిక్ టాయిలెట్ల శుభ్రతలో కొత్తగూడెం మినహా అన్ని మున్సిపాలిటీలు వెనుకబడినట్లు స్వచ్ఛ సర్వేక్షన్ మార్కుల ద్వారా వెల్లడైంది.

గతంతో పోలిస్తే కిందకు ర్యాంకులు..

ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, ఇల్లెందు మున్సిపాలిటీల ర్యాంకులు పడిపోవడం గమనార్హం. 2023లో ఖమ్మం మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయిలో ఏడో ర్యాంకు రాగా.. ఈ నెల 17న ప్రకటించిన 2024 ఏడాది ర్యాంకుల్లో 60కి పడిపోయింది. జాతీయస్థాయిలో 141 నుంచి 373కు దిగజారింది. ఇల్లెందు మున్సిపాలిటీ రాష్ట్రంలో 21వ ర్యాంకు నుంచి 93వ ర్యాంకుకు పడిపోగా, జాతీయస్థాయిలో 539 నుంచి 927వ ర్యాంకుకు దిగజారింది. ఇక మధిర, సత్తుపల్లి, వైరా, కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు మున్సిపాలిటీలు మాత్రం అద్భుతమైన ప్రగతి సాధించకపోయినా రాష్ట్ర, జాతీయస్థాయిలో కొంత మెరుగైన ర్యాంకులు సాధించాయి.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తాం

మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్

కొత్తగూడెంఅర్బన్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కొత్తగూడెం ఉర్దూఘర్‌లో నిర్వహించిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పదేళ్లపాటు పాలన సాగించిన బీఆర్ఎస్ చాలా రంగాల్లో విఫలం చెందితే, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవని చేతులు ఎత్తేస్తున్నారని విమర్శించారు. భవిష్యత్‌లో వచ్చే ఏ ఎన్నికల్లో అయినా తెలంగాణ రాష్ట్రీయ లోక్‌దళ్ పార్టీ బరిలో ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మల్లేష్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు కట్టా సతీష్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు జాని, జనరల్ సెక్రెటరీ జీవి.ప్రసాద్, అశ్వారావుపేట ఇన్‌చార్జ్ ప్రసాద్, బీసీ సంఘం నాయకులు అంకినీడు ప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన


ప్రజలతో మాట్లాడుతున్న కేంద్ర ప్రతినిధులు

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం, మాణిక్యారం గ్రామాల్లో కేంద్ర బృందం ప్రతినిధులు అబ్దుల్ బషీర్, సౌదాగర్ శుక్రవారం పర్యటించారు. ఆయా గ్రామ పంచాయతీల్లో నేరుగా ప్రజలతో సమావేశమై కేంద్ర ప్రభుత్వం ద్వారా వ్యవసాయం, ఎన్ఆర్ఈజీఎస్, మహిళా పొదుపు సంఘాలకు చేకూరుతున్న లబ్ధి, వినియోగం తదితర అంశాలపై ఆరా తీశారు. నేరుగా లబ్ధిదారులను ప్రశ్నించిన వారు.. సమాధానాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధన్‌సింగ్, చిరంజీవి, శంకర్, దుర్గారావు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

సాక్షి ఎఫెక్ట్..


యూరియా కొనుగోలు చేసి తీసుకెళ్తున్న రైతులు

కరకగూడెం: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సెల్ పాయింట్‌లో యూరియా స్టాక్ ఉన్నప్పటికీ డీసీ నంబర్ రాకపోవడంపై శుక్రవారం 'సాక్షి'లో 'యూరియా కోసం రైతుల నిరీక్షణ' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో సంబంధిత అధికారులు స్పందించి, యూరియాను పంపిణీ చేశారు.

ఏజెన్సీ అభివృద్ధికి కలిసి నడుద్దాం..


మాట్లాడుతున్న లింగయ్యదొర

కరకగూడెం: ఏజెన్సీ అభివృద్ధికి గిరిజనులు, గిరిజనేతరులు ఐక్యంగా ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే, ఆదివాసీ జేఏసీ జాతీయ అధ్యక్షుడు చందా లింగయ్యదొర పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో గిరిజనేతరులు నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో వందల ఏళ్ల నుంచి గిరిజనేతరులు, ఆదివాసీలు ఒకే కుటుంబంలా జీవనం సాగిస్తున్నారని, అలాంటి వారి మధ్య కొందరు విభేదాలు సృష్టించడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. చట్టాలకు గిరిజనేతరులు ఎప్పటికీ అడ్డుకాదని, ఏజెన్సీ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టి అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో కొంపెల్లి రామలింగం, చిట్టి వెంకటేశ్వర్లు, సయ్యద్ ఇక్బాల్‌హుస్సేన్, భైరిశెట్టి చిరంజీవి, రావుల సోమయ్య, బుడగం రాము, శ్రీరాం చంద్రయ్య, తిప్పని కృష్ణారావు, నాగబండి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఐ అశోక్‌కు డీఎస్పీగా ఉద్యోగోన్నతి


సీఐ అశోక్

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం సీఐగా విధులు నిర్వర్తిస్తున్న బొడ్డు అశోక్‌కు ప్రభుత్వం డీఎస్పీగా ఉద్యోగోన్నతి కల్పించింది. మావోయిస్టుల ఏరివేతలో ప్రతిభ కనబరిచినందుకు యాక్సలేటరీ ప్రమోషన్‌ను కల్పించారు. అశోక్ 2007 బ్యాచ్ ఎస్ఐగా ఉద్యోగంలో చేరారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచి 2017లో సీఐగా ప్రమోషన్‌తోపాటు 2021లో కఠినసేవ, 2023 యంత్రిక సురక్ష సేవ, 2024లో ముఖ్యమంత్రి శౌర్య పురస్కారాలను అందుకున్నారు. దుమ్ముగూడెం సీఐగా 2024 ఫిబ్రవరిలో విధుల్లో చేరి ప్రస్తుతం డీఎస్పీగా ఉద్యోగోన్నతి పొందడంతో పలువురు అభినందించారు.

ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారిగా సురేంద్రమోహన్


సురేంద్రమోహన్

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాల వారీగా సీనియర్ ఐఏఎస్‌లను ప్రత్యేక అధికారులుగా నియమించింది. గతంలో వీరిని నియమించినా కొన్ని మార్పులు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సురేంద్రమోహన్‌ను నియమించారు. ఆయన గతంలో ఖమ్మం జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించడమే కాక కొన్నాళ్లపాటు ప్రత్యేక అధికారిగా కూడా వ్యవహరించారు.

నానో యూరియా వాడకంతో లాభాలు


పురుగుమందులను పరిశీలిస్తున్న డీఏఓ బాబూరావు

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ): పంటల్లో నానో యూరియా వాడకంతో అధిక లాభాలుంటాయని జిల్లా వ్యవసాయశాఖాధికారి బాబూరావు తెలిపారు. మండల కేంద్రం అన్నపురెడ్డిపల్లిలో శుక్రవారం ఆయన ఆకస్మికంగా పర్యటించి ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్ గోదాములను పరిశీలించారు. రైతులు నానో యూరియా వాడేలా అవగాహన కల్పించాలని మండల అధికారులకు సూచించారు. వరిపొలాల్లో అజోల్లా విడుదల చేయాలని, ఫలితంగా గాలిలో ఉన్న నత్రజని మొక్కకి అందేలా చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ సరిత, ఏఓ అనూష, ఏఈఓలు ప్రశాంత్, సుజాత పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో అప్పీల్ కొట్టివేత

కొత్తగూడెంటౌన్: చెక్ బౌన్స్ కేసులో క్రిమినల్ అప్పీల్‌ను కొట్టివేస్తూ శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ తీర్పు చెప్పారు. పాల్వంచ కాంట్రాక్టర్స్‌కాలనీకి చెందిన గంట్రెటి కృష్ణ వినాయక ఎంటర్‌ప్రైజెస్ తరఫున 2011 మార్చి 7వ తేదీ పాల్వంచకు చెందిన మిరియాల అలివేలు వద్ద రూ.5 లక్షలను అప్పుగా తీసుకున్నారు. డబ్బులు తిరిగి ఇవ్వాలని అలివేలు అడుగగా 2013 అక్టోబర్ 3న కృష్ణ రూ.7 చెక్ ఇవ్వగా అది బౌన్స్ అయింది. దీంతో తన న్యాయవాది ద్వారా అలివేలు కోర్టులో చెక్‌బౌన్స్ కేసు దాఖలు చేశారు. విచారణ అనంతరం 2021 ఆగస్టు 31న ఫిర్యాదికి గంట్రెటి కృష్ణ రూ.14 లక్షలు చెల్లించాలని అప్పటి రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.నీలిమ తీర్పు చెప్పారు. ఈ తీర్పుపై గంట్రెటి కృష్ణ కొత్తగూడెం జిల్లా కోర్టులో అప్పీల్ చేశారు. ఆ అప్పీల్‌పై ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి పాటిల్ వసంత్ కింది కోర్టు తీర్పును ఖరారు చేస్తూ అప్పీల్‌ను కొట్టివేశారు.

వ్యక్తికి ఏడాది జైలు శిక్ష

కొత్తగూడెంటౌన్: భూ వివాదాన్ని దృష్టిలో పెట్టుకుని బాబాయిని కర్రతో కొట్టిన అబ్బాయికి జైలు శిక్ష విధిస్తూ శుక్రవారం కొత్తగూడెం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.కిరణ్‌కుమార్ తీర్పు చెప్పారు. 2022 ఫిబ్రవరి 21న పాల్వంచ మండలం పాండురంగాపురానికి చెందిన మైనేని వెంకటేశ్వరరావు తన పొలంలో నీళ్లు పెట్టుకుంటున్నాడు. తన అన్న కొడుకు మైనేని ఉదయ్‌భాస్కర్‌కు పక్కనే పొలం ఉంది. పొలం విషయంలో గతంలో జరిగిన గొడవను దృష్టిలోపెట్టుకుని వెంకటేశ్వరావుపై ఉదయ్‌భాస్కర్ కర్రతో దాడి చేసి గాయపర్చాడు. ఈ విషయమై వెంకటేశ్వరరావు కూతురు దుగ్గిని ఉషా పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన అనంతరం పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. 12 మంది సాక్షులను విచారించిన న్యాయమూర్తి ఉదయ్‌భాస్కర్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

సింగరేణి బెనిఫిట్స్ రాలేదని గడ్డిమందు తాగిన మాజీ ఉద్యోగి

ఇల్లెందు: పట్టణంలోని ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన సింగరేణి మాజీ ఉద్యోగి తనకు బెనిఫిట్స్ కూడా అందలేదని గడిమందుతాగి.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. 12వ వార్డుకు చెందిన మెంతబోయిన రాములు (70) 2005లో సింగరేణి నుంచి డిస్మిస్ అయ్యారు. 2006లో కోర్టులో తన డిస్మిస్‌ను సవాల్ చేస్తూ కేసు వేశారు. కుటుంబ పోషణ కోసం పండ్ల వ్యాపారం చేశాడు. 2024లో కోర్టులో కేసు తనకు అనుకూలంగా రాలేదు. దీంతో మరింత కుంగిపోయిన రాములు ఈ నెల 21న గడ్డి మందు తాగాడు. గమనించిన కటుంబ సభ్యులు ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. రాములుకు భార్య, పిల్లలు ఉన్నారు. కాగా, తాను సంస్థ వద్ద దాచుకున్న డబ్బు కూడా రాలేదనే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి కుమారుడు లెనిన్‌కుమార్ ఫిర్యాదు మేరకు సీఐ టి.సురేశ్ కేసు నమోదు చేశారు.

బంజారాల బతుకమ్మ తీజ్

- ప్రకృతితో ముడిపడిన పండుగ
- గిరిజన గ్రామాల్లో మొదలైన సందడి
- తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు


మంచె పైనుంచి తీజ్ బుట్టలు తీస్తున్న యువతులు (ఫైల్)


బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు బయలుదేరిన యువతులు, చిన్నారులు, మహిళలు(ఫైల్)

జూలూరుపాడు: గిరిజన బంజారుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన తీజ్ ఉత్సవాలు జిల్లా లోని గిరిజన తండాల్లో వైభవంగా జరుపుకోనున్నారు. శ్రావణ మాసం శుక్రవారం నుంచి తీజ్‌ఉత్సవాలు ఆరంభమయ్యాయి. ఆషాఢ మాసంలో సీత్లా జరుపుకోగా, తరువాత ప్రకృతితో ముడిపడి ఉన్న తీజ్‌ను జరుపుకుంటారు. మొలకల పండుగ అని పిలిచే ఈ తీజ్ బతుకమ్మను పోలి ఉంటుంది. పెళ్లి కాని ఆడపడుచులు ఉత్సవాలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

తొమ్మిది రోజుల వేడుక

బతుకమ్మ ఉత్సవాల మాదిరిగానే తీజ్ ఉత్సవాలు 9 రోజుల పాటు సాగుతాయి. పెళ్లికాని ఆడపడుచు లు తండా పెద్ద అనుమతితో వెదురుబుట్టలో ఎర్ర మట్టి, ఇసుక, ఎరువు పోసి నానబెట్టిన గోధుమలు, వేరుశనగలు విత్తుతారు. 9 రోజులపాటు యువతులు ఉపవాస దీక్షతో నీళ్లు పోస్తూ, ఆటపాటలతో గడుపుతారు. పెళ్లికాని యువతులే కాకుండా తండాలోని మహిళలంతా ఒక్కపూట భోజనంచేస్తారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంచెపై వెదురు బుట్టల్లో నీళ్లు పోసి రోజూ ఆటపాటలతో పూజలు నిర్వహిస్తారు. పెళ్లికాని యువతులు తమకు మంచిభర్తలు రావాలని, తండా ప్రజలందరూ సుఖసంతోషాలుతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి బాగా పంటలు పండాలని ఆకాంక్షిస్తారు. బుట్ట ల్లోని గోధుములు, వేరుశనగ గింజలు మొలకెత్తాక, 9వ రోజు తీజ్ బుట్టలను మంచె పైనుంచి కిందకు దించి, బుట్టల్లోని నారును తెంచుతారు. ఈ నారు ను పెద్దలు, అన్నదమ్ముల చెవుల్లో పెట్టి యువతు లు ఆశీస్సులు పొందుతారు. తర్వాత ఆటపాటలతో తీజ్ బుట్టలను యువతులు, మహిళలు ఊరేగింపుగా తీసుకెళ్లి వాగులు, వంకలు, చెరువులు, నదుల్లో నిమజ్జనం చేస్తారు.

పంటలు పండాలని..

ఈ పండుగ ముఖ్య ఉద్దేశం పాడి, పంటలు పండాలని, ఆయురారోగ్యాలతో ప్రజలంతా ఉండాలని, పెళ్లి కానీ యువతులకు వివాహం జరగాలని. తీజ్ ఉత్సవాల్లో భాగంగా మొలకలు వచ్చిన వెదురు బుట్టలతో పాటు, ప్రత్యేకంగా తయారు చేసిన శివలింగాన్ని పల్లకీలో ఉంచి, దానిని యువతులు మోస్తూ గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తారు. గిరిజనమహిళలు, యువతులు సంప్రదాయ దుస్తులు ధరిస్తారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్న బంజార తండాల్లో తీజ్ ఉత్సవాలను గిరిజన ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. 18వశతాబ్దంలో గుండియా అనే వ్యక్తితో బంజారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని పెద్ద లు చెబుతారు. సేవాలాల్ మహరాజ్ సూచనతో గుండియాను రాఖీపౌర్ణమిరోజు సంహరించారని, అందుకు గుర్తుగా రాఖీపౌర్ణమి రోజునగుండియా దిష్టిబొమ్మను దహనం చేసి తీజ్ పండుగను యువతులు ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోంది. తీజ్ పండుగను రాజస్తాన్ మొదలు అన్ని రాష్ట్రాల్లోని బంజారులు ఘనంగా జరుపుకుంటున్నారు.

ఆనందంగా జరుపుకుంటాం..



తీజ్ ఉత్సవాలు తొమ్మిది రోజులపాటు ఆనందంగా జరుపుకుంటాం. పెళ్లికాని యువతులు, మహిళలు తీజ్ బుట్టల్లోని విత్తనాలకు తొమ్మిది రోజుల పాటు నీళ్లు పోసి, ఆటపాటలతో పూజలు చేస్తారు. తొమ్మిది రోజులు ఉపవాస దీక్ష చేస్తాం. తీజ్ బుట్టలు ఏర్పాటు చేసిన వారంతా రోజూ శాఖాహారం తింటారు. –భూక్యా నవ్య, జూలూరుపాడు మండలం

మాకిదే బతుకమ్మ



బంజారాల సంస్కృతి, సంప్రదాయాల పండుగ తీజ్. పెళ్లికాని యువతులు మంచి భర్త రావాలని, అన్నదమ్ములు, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటారు. తీజ్ బుట్టలను ఆఖరి రోజు చెరువులో నిమజ్జనం చేయడంతో ఉత్సవాలు ముగుస్తాయి. మాకు ఇదే బతుకమ్మ పండుగ.

–బానోత్ లక్ష్మి, జూలూరుపాడు మండలం

కేటీపీఎస్ ఉద్యోగి ఆత్మహత్య


రాంనీల్‌ప్రసాద్ (ఫైల్)

పాల్వంచ: అనారోగ్య సమస్యలు తాళలేక కేటీపీఎస్ ఉద్యోగి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. స్థానిక కేటీపీఎస్ 5, 6 దశల కర్మాగారం కోల్ ప్లాంట్‌లో విధులు నిర్వహించే గ్రేడ్-1 ఫోర్‌మెన్ ముళ్లపూడి రాంనీల్‌ప్రసాద్ (45) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. అనారోగ్య సమస్యతో ఆస్పత్రికి వెళ్లగా ఉపిరితిత్తుల సమస్య ఉందని వైద్యులు తెలిపారు. శుక్రవారం గదిలోకి వెళ్లిన రాంనీల్‌ప్రసాద్‌ను ఒంటిగంట సమయంలో భార్య స్నేహలత లేపేందుకు వెళ్లింది. లోపల ఆయన సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉన్నాడు. స్థానికుల సాయంతో కేటీపీఎస్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య స్నేహలత ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కుమార్తెలు సుస్మిత, సాయితన్మయి ఉన్నారు.

గుంతలో పడి ఆటో బోల్తా


మండలపల్లి శివారులో రోడ్డుపై బోల్తా పడిన ఆటో

దమ్మపేట: గుంతలో పడి ఆటో బోల్తా పడగా, నలుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలైన ఘటన మండలంలోని మందలపల్లి శివారులోని జాతీయ రహదారిపై శుక్రవా రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఏపీ లోని జంగారెడ్డిగూడెం నుంచి సత్తుపల్లి వైపునకు ఆటోలో ఏడుగురు ప్రయాణికులు వెళ్తున్నారు. భారీ వర్షం పడుతుండగా.. మందలపల్లి శివారులో నీటితో నిండి ఉన్న పెద్దగుంతలో ఆటో ముందు చక్రం పడింది. ఒక్కసారిగా అదుపుతప్పిన ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు మహిళలకు తీవ్ర గాయాలు కాగా, అంబులెన్స్‌లో అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అదుపుతప్పి లారీ..


అదుపుతప్పి బోల్తాపడిన లారీ

అశ్వారావుపేటరూరల్: అదుపుతప్పి ఓ లారీ రోడ్డుపై బోల్తా పడిన ఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ నుంచి ఏపీలోని భీమవరం వైపు చేపల దాణా లోడుతో వెళ్తున్న భారీ లారీ అశ్వారావుపేట – భద్రాచలం మార్గంలో అదుపుతప్పి బోల్తాపడింది. వాహనాల రాకపోకలకు సుమారు రెండు గంటల పాటు అంతరాయం కలిగింది. ఎస్ఐ యాయతి రాజు ఘటనా స్థలాన్ని పరిశీలించి జేసీబీ సాయంతో రోడ్డుపై నుంచి లారీని తొలగించారు. లారీడ్రైవర్, క్లీనర్‌కు గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు.

కలెక్టరేట్ సిబ్బందికి యూనిఫామ్ పంపిణీ


యూనిఫామ్ పంపిణీ చేస్తున్న కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్ సిబ్బందికి శుక్రవారం కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ యూనిఫామ్ పంపిణీ చేశారు. కలెక్టరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్న 40 మంది అటెండర్లు, వాచర్లు, డ్రైవర్లు, స్వీపర్లు, వాచ్‌మెన్‌లకు పంపిణీ చేశారు.